కోదండరావుపల్లిలో హరీశ్‌రావు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

హరీశ్‌రావు చిత్రపటానికి క్షీరాభిషేకం

నారాయణరావుపేట, మార్చి 6: రంగనాయకసాగర్ ప్రాజెక్ట్ నుంచి ఎడమ కాలువ ద్వారా నీటిని విడుదల చేసిన సందర్భంగా మండలంలోని కోదండరావుపల్లి గ్రామంలో గురువారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు చిత్రపటానికి రైతులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యాసంగి పంటలకు మాజీ మంత్రి హరీశ్‌రావు కృషితో గోదావరి జలాలు వస్తుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావుకు ధన్యవాదాలు తెలిపారు.



హైదరాబాద్‌లో జరిగిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి కూతురు వివాహానికి హాజరైన బీఆర్ఎస్ నాయకులు

ఎమ్మెల్యే కూతురు వివాహానికి హాజరైన నాయకులు

దుబ్బాక, మార్చి 6: దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి కూతురు కీర్తిరెడ్డి వివాహం గురువారం హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఈ వివాహానికి దుబ్బాక మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గన్నే వనితాభూంరెడ్డితో పాటు మాజీ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు భారీ సంఖ్యలో పాల్గొని, నూతన దంపతులను ఆశీర్వదించారు.

కేసీఆర్ పాలనలో బాధితులకు భరోసా

లబ్ధిదారుడికి సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చేర్యాల, మార్చి 6 : కేసీఆర్ పాలనలో ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న బాధితులకు భరోసా లభించిందని బీఆర్ఎస్ టౌన్ అధ్యక్షుడు ముస్త్యాల నాగేశ్వర్‌రావు, రాష్ట్ర నాయకుడు ముస్త్యాల బాల్‌నర్సయ్య, మున్సిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ మంగోలు చంటి అన్నారు. పట్టణానికి చెందిన సుధాకర్‌కు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మంజూరు చేయించిన సీఎంఆర్ఎఫ్ చెక్కును గురువారం బీఆర్ఎస్ నాయకులు బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీలకతీతంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సీఎంఆర్ఎఫ్ ద్వారా నగదు మంజూరు చేయిస్తున్నారని తెలిపారు. జనగామ నియోజకవర్గంలో అనారోగ్యానికి గురై ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న బాధితులకు ఎమ్మెల్యే సొంత దవాఖానలో ఉచితంగా వైద్యం, పరీక్షలు, మందులు ఇస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ సర్కారు పాలనలో సీఎంఆర్ఎఫ్ ద్వారా కేవలం రూ.60వేల సహాయం అందించడం సరికాదని, బాధితులకు వ్యాధుల తీవ్రతను బట్టి ఎక్కువ సహాయం అందించాలన్నారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి బూరగోని తిరుపతి గౌడ్, మైనార్టీ ఇన్‌చార్జి బీరెడ్డి ఇన్నారెడ్డి, బీఆర్ఎస్ కార్మిక విభాగం జిల్లా బాధ్యుడు ముస్త్యాల గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో డప్పుల ప్రదర్శన

బెజ్జంకి, మార్చి 6: ఎస్సీ వర్గీకరణపై షమీమ్ అక్తర్ ఇచ్చిన నివేదికలో లోపాలను సవరించాలని కోరుతూ మండలంలోని గూడెం, బేగంపేట గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో డప్పులతో గురువారం బహిరంగ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు పరశురాములు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణలో ఉపకులాలకు నష్టం జరగకుండా ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బాలయ్య, లక్ష్మణ్, బాబు, స్వామి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పశువుల పాక దగ్ధం

చేర్యాల, మార్చి 6: మండలంలోని కడవేర్గు గ్రామానికి చెందిన రైతు కదిరె బాలయ్యకు చెందిన పశువుల పాకను గుర్తుతెలియని వ్యక్తులు గురువారం దగ్ధం చేశారని గ్రామస్తులు తెలిపారు. మధ్యాహ్నం వ్యవసాయ బావి వద్ద ఉన్న పశువుల పాకకు దుండగులు నిప్పు పెట్టడడంతో పాక పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో మూడు మేకపోతులు కాలిపోగా, అక్కడే కట్టేసిన మూడు ఆవులు, పాడి గేదెలు పారిపోయాయి. లేగ దూడకు గాయాలయ్యాయి. ఈ ఘటనతో బాధిత రైతు కుటుంబం తీవ్ర భయాందోళనకు గురవుతున్నది. ఎస్ఐ నిరేశ్‌ను వివరణ కోరగా బాధితులు ఎలాంటి ఫిర్యాదు చేయలేదన్నారు.

నెంటూర్‌లో స్వయంపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

స్వయంపాలన దినోత్సవం

వర్గల్, మార్చి 6: వర్గల్ మండలం నెంటూర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలో గురువారం విద్యార్థులు స్వయంపాలనా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. డీఈవోగా చంద్రారెడ్డి, ఎంఈవోగా లాస్య, హెచ్ఎంగా ఎల్లేశ్ వ్యవహరించగా, మరి కొంతమంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం కిష్టాగౌడ్, ఉపాధ్యాయులు సుజాత, రాజేశ్వరి, రజిత, అమ్మా కమిటీ అధ్యక్షురాలు రమ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళా అధ్యాపకులకు సత్కారం

మహిళలు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

సిద్దిపేట టౌన్, మార్చి 6: మహిళలు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని డాక్టర్ యశస్వి సూచించారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు యశస్వి, మహాలక్ష్మి మాట్లాడుతూ.. యుక్త వయస్సులో వచ్చే సమస్యలను విద్యార్థినులు అధిగమించాలన్నారు. రుత సంబంధ సమస్యలను, ఆ సమయ్యలో వచ్చే మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మహిళా అధ్యాపకులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత, అనురాధ, ఉమా మహేశ్వరి, రోహిణి, రాణి, శైలజ, పుణ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

సారునీరు తరలిస్తే సహించం

- బీఆర్ఎస్ నాయకుల హెచ్చరిక

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

నంగునూరు, మార్చి 6: మండల రైతుల నోట్లో మట్టికొట్టి సాగునీటిని తరలించుకుపోతే సహించేది లేదని మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కోల రమేశ్‌గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అనగోని లింగం గౌడ్ అన్నారు. గురువారం నంగునూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. తపాస్‌పల్లి రిజర్వాయర్ ద్వారా కమలాయపల్లి, అర్జున్‌పట్ల, ఆకునూరు, జాలపల్లి గ్రామాలకు డీ3 కాలువ ద్వారా సాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలని కానీ, నంగునూరు మండల రైతుల నోట్లో మట్టికొట్టి రంగనాయకసాగర్ నీటిని మద్దూరు మండలంలోని గ్రామాలకు మళ్లించే ప్రయత్నాలను కాంగ్రెస్ నాయకులు విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారు. భువనగిరి ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి కమలాయపల్లి గ్రామాన్ని సందర్శించి నంగునూరు మండలానికి ఆర్ ఎంసీ ద్వారా వచ్చే ఎల్‌డీ-10 కెనాల్ సందర్శనలో భాగంగా కమలాయపల్లి గ్రామ శివారులో నుంచి కాల్వ పోతుందని, ఆ ప్రాంతంలో ఓటీని నిర్మించి మద్దూరు మండలంలోని ఐదు గ్రామాలకు సాగునీరు ఇవ్వాలని అధికారులను ఆదేశించడం సమంజసం కాదన్నారు. నంగునూరు మండలంలో ఎల్‌డీ-10 కెనాల్ నిర్మించి 10 గ్రామాలకు సాగునీరు అందిస్తున్నారని, ఇప్పటికే ఆ గ్రామాలకు సాగునీరు సరిగా అందకపోవడంతో పొలాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అరకొరగా వచ్చే సాగునీరును కాంగ్రెస్ నాయకులు మళ్లించే ప్రయత్నాలు చేయవద్దని, అవసరమైతే తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి మద్దూరు మండలంలోని గ్రామాలకు సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ రాగుల సారయ్య, బీఆర్ఎస్ నాయకులు మల్లయ్య, బద్దిపడగ కృష్టారెడ్డి, రాజిరెడ్డి, పురేందర్, మహేందర్ గౌడ్ పాల్గొన్నారు.

నైపుణ్యం, సమర్థతతోనే మహిళలకు గుర్తింపు

- మహిళా దినోత్సవ వేడుకల్లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ స్వాతిరెడ్డి

కేక్ కట్ చేస్తున్న స్వాతిరెడ్డి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కోర్టు సిబ్బంది

హుస్నాబాద్, మార్చి 6: నైపుణ్యం, సమర్థతతోనే మహిళలకు సమాజంలో గుర్తింపు లభిస్తుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ స్వాతిరెడ్డి అన్నారు. గురువారం హుస్నాబాద్ మున్సిపల్ సమావేశ మందిరంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మహిళలకు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎవరిపై ఆధారపడకుండా సొంత ఆలోచనలతో ముందుకెళ్లాలన్నారు. మహిళలను ప్రోత్సహించేందు రిజర్వేషన్లు ప్రవేశపెట్టారని, వీటిని సద్వినియోగం చేసుకొని నచ్చిన రంగాల్లో స్థిరపడాలన్నారు. అమ్మ సమాజానికి తొలిగురువు అని, ఆమె క్రమశిక్షణతో ఉంటూ కుటుంబ సభ్యులను క్రమశిక్షణంలో ఉంచినట్లయితే సమాజంలో శాంతి నెలకొంటుందన్నారు. లింగ వివక్ష, వేధింపుల నుంచి రక్షించుకునేందుకు అనేక చట్టాలు ఉన్నాయన్నారు. ఆర్థిక స్వాతంత్ర్యాన్ని కాపాడుకుంటూ ముందుకు పోయినట్లయితే అన్ని రంగాల్లో ఎదుగుతారని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ గౌడ్, ఐసీడీఎస్ సీడీపీవో జయ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్, న్యాయవాది కన్నోజు రామకృష్ణ, హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, బెజ్జంకి మండలాల అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తాం

- ఆర్వీఎం సూపరింటెండెంట్ శ్రీనివాస్

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వీఎం సూపరింటెండెంట్ శ్రీనివాస్, వైద్యులు

ములుగు, మార్చి 6: గ్రామీణ ప్రాంత పేదలకు నాణ్యమైన, అత్యాధునిక వైద్య సేవలు అందిస్తున్నామని ఆర్వీఎం దవాఖాన సూపరింటెండెంట్ శ్రీనివాస్ అన్నారు. ములుగు మండలం లక్ష్మక్కపల్లిలోని ఆర్వీఎం దవాఖానలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమర్జెన్సీ సేవలతోపాటు ఓపెన్‌హార్ట్ బైపాస్ సర్జరీలాంటి అరుదైన శస్త్ర చికిత్సలను ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు అందిస్తున్నామన్నారు. ఇటీవల రోగికి ప్యాంక్రియాటిక్ క్యాన్సర్ కణతిని శస్త్రచికిత్స ద్వారా తొలిగించి అరుదైన ఘనత సాధించామన్నారు. రోగిపై ఆర్థిక భారం పడకుండా ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్ర చికిత్స చేసినట్లు వైద్యులు తెలిపారు. ప్రజలు హైదరాబాద్‌కు వెళ్లి సమయం, డబ్బులు వృథా చేసుకోకుండా ఏ సమస్య వచ్చినా లక్ష్మక్కపల్లిలోని ఆర్వీఎం దవాఖానలో సంప్రదించాలని సూచించారు. దవాఖానలో వైద్య బృందం 24 గంటలూ రోగులను ప్రత్యేకంగా పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయి పరికరాలతో అనుభవజ్ఞులైన డాక్టర్లతో వైద్య సేవలందిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో సీఈవో శ్రీనివాస్, వైద్యబృందం ఉన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

తనిఖీలు చేస్తున్న సీఐ వాసుదేవరావు

సిద్దిపేట టౌన్, మార్చి 6: యువత గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సిద్దిపేట వన్‌టౌన్ సీఐ వాసుదేవరావు సూచించారు. గంజాయి నిర్మూలనే లక్ష్యంగా సీఐ నేతృత్వంలో అనుమానాస్పద ప్రాంతాల్లో నార్కోటిక్స్ డాగ్స్‌తో విస్తృతస్థాయి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. మత్తు పదార్థాల రవాణా, విక్రయాలపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశామన్నారు. గంజాయి రహిత జిల్లా రూపకల్పనే లక్ష్యమన్నారు. గంజాయి, మత్తు పదార్థాలు ఎవరైనా కలిగి ఉన్నా.. విక్రయించినా తక్షణమే డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు.

ఇసుక డంపు స్వాధీనం

ఇసుక డంపు వద్ద పోలీసులు

హుస్నాబాద్, మార్చి 6: హుస్నాబాద్ శివారులోని చొప్పరి మల్లేశ్ వ్యవసాయ పొలం వద్ద అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సుమారు 30 టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మండలంలోని రాములపల్లి-నాగారం గ్రామాల మధ్య అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న మినీ టిప్పర్‌ను సిద్దిపేట టాస్క్‌ఫోర్స్‌తోపాటు స్థానిక పోలీసులు పట్టుకున్నారు. ఇసుక తరలిస్తున్న అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి గ్రామానికి చెందిన మెడవేని రాజు, హుస్నాబాద్‌కు చెందిన కేశవేని రమేశ్, కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్‌కు చెందిన ఎర్ర శేఖర్, గణేశ్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహేశ్ తెలిపారు. ఇసుక, రేషన్ బియ్యం అక్రమ రవాణాతోపాటు గంజాయి తదితర మత్తు పదార్థాల రవాణా జరిగితే సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.

ఔట్ సోర్సింగ్ ఏజెన్సీకి నోటీసులు జారీ

చేర్యాల, మార్చి 6: కొమురవెల్లి ఆలయం నుంచి జీఎస్టీ రూపంలో చెల్లించిన రూ. 14,11,291ను వెంటనే ఆలయానికి చెల్లించాలని, లేనిపక్షంలో లేబర్ యాక్ట్, నిబంధనల ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఔట్ సోర్సింగ్ ఏజెన్సీకి ఆలయ అధికారులు నోటీసులు జారీ చేశారు. 1 జూలై 2023 నుంచి 31 డిసెంబర్ 2024 వరకు 18 నెలలకు సంబంధించిన జీఎస్టీ సొమ్ము రూ.16,51,636ను ఔట్ సోర్సింగ్ సంస్థ ప్రభుత్వానికి చలాను ద్వారా కేవలం మూడు నెలలకు సంబంధించి రూ.2,40,346 మాత్రమే చెల్లించింది. దీనిని గుర్తించిన ఆలయ అధికారులు జీఎస్టీ రూపంలో ప్రభుత్వ ఖజానాకు చెల్లించాల్సిన రూ. 14,11,291లను నోటీసు ముట్టిన 15 రోజుల్లో దేవస్థాన ఖజానాలో జమ చేయాలన్నారు. లేనిపక్షంలో చర్యలు తీసుకోవడంతోపాటు సంస్థను బ్లాక్ లిస్ట్‌లో చేర్చుస్తామని హెచ్చరించారు.

పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సిద్దిపేట, మార్చి 6: పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం వారు చైతన్య పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నిబంధనలు తుంగలో తొక్కుతూ శ్రీ చైతన్య విద్యాసంస్థలు 9వ తరగతి విద్యార్థులకు అడ్వాన్సుడ్ పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తూ, పుస్తకాలు ఇప్పుడే కొనాలని ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యార్థులపై ఒత్తిడి పెరిగేలా చేస్తున్నాయన్నారు. గతంలో మండల విద్యాధికారికి సమాచారం ఇచ్చినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. పదోతరగతి అడ్వాన్సుడ్ పరీక్షలు నిర్వహిస్తున్న చైతన్య కార్పొరేట్ విద్యసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్, విష్ణు, తేజ, నవదీప్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజల మనసు గెల్చిన హరికృష్ణ

- పట్టభద్రుల అసోసియేషన్ సిద్దిపేట, మెదక్ జిల్లాల ఇన్‌చార్జి జగదీశ్వర చారి

సిద్దిపేట టౌన్, మార్చి 6: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రధాన జాతీయ పార్టీల అభ్యర్థులతో సరి సమానంగా పోటీపడి ముచ్చెమటలు పట్టించిన ప్రసన్న హరికృష్ణ తెలంగాణ ప్రజల మనస్సు గెల్చుకున్నారని పట్టభద్రుల అసోసియేషన్ సిద్దిపేట, మెదక్ జిల్లాల ఇన్‌చార్జి తుమ్మెజు జగదీశ్వరచారి అన్నారు. సిద్దిపేటలో గురువారం ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య పరిరక్షణకు.. ధన రాజకీయాలకు స్వస్తి పలికేందకు ఎమ్మెల్సీగా బరిలో నిలిచి ధన రాజకీయాలు చేయలేక న్యాయం గా గెలిచి ఓడారన్నారు. మొదటిసారి ఎన్నికల్లో పోటీ చేసి 60వేలకు పైగా ఓట్లు సాధించి భవిష్యత్ నేతగా ఎదిగారన్నారు. బీజేపీ, కాంగ్రెస్ డబ్బు, అధికార బలంతో ఓటర్లను మభ్యపెట్టి నీతిమాలిన రాజకీయాలు చేసి గెలిచారని మండిపడ్డారు. పార్టీ సిద్ధాంతాలను పక్కన పెట్టి రెండు పార్టీలు బీసీ బిడ్డను ఓడించేందుకు కుట్రలు చేశాయన్నారు. పట్టభద్రులకు ఎలాంటి సంబంధం లేని వ్యక్తులను ఎన్నికల్లో నిలబెట్టి శాసన మండలిని మరోసారి రాజకీయ నాయకుల పునరావాస కేంద్రం మార్చడానికి ప్రయత్నించాయని దుయ్యబట్టారు. భవిష్యత్‌లో డబ్బు, మద్యం లేని రాజకీయాలను ప్రోత్సహించాలన్నారు. ప్రసన్న హరికృష్ణ ఓడినా పట్టభద్రుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తారన్నారు.

ఇన్‌స్పైర్ అవార్డులకు విద్యార్థుల ఎంపిక

గజ్వేల్, మార్చి 6: జాతీయస్థాయిలో నిర్వహించిన ఇన్‌స్పైర్ అవార్డులకు గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని సెయింట్ మేరీస్ విద్యార్థులు ఎంపికయ్యారు. పాఠశాల నుంచి నాలుగు ప్రాజెక్టులు ఎంపికైనట్లు కరస్పాండెంట్ ఇన్నారెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. దాసరి అనిల్‌కుమార్, బొమ్మల స్నిద్ధ, తాళ్ల శ్రీహస్, మర్ధ నందన్ వ్యవసాయ రంగం, ప్రమాదాల నుంచి రక్షించు వంటి ప్రాజెక్టులను రూపొందించి ప్రదర్శించడంలో వారిని ఇన్‌స్పైర్ అవార్డులకు ఎంపిక చేసినట్లు తెలిపారు.

విద్యార్థులు దంతాలను కాపాడుకోవాలి

దంత పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ స్వామి

సిద్దిపేట టౌన్, మార్చి 6: దంత సంరక్షణపై విద్యార్థులకు అవగాహన ఉండాలని దంత వైద్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డీఎన్ స్వామి సూచించారు. తెలంగాణ దంత వైద్య సంఘం, స్ఫూర్తి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా డెంటల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా 15 మంది దంత వైద్యులు విద్యార్థులకు దంత సంరక్షణపై అవగాహన కల్పిస్తూ, 300లకుపైగా విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. అనంతరం డాక్టర్ స్వామి మాట్లాడుతూ.. మనిషి ఆరోగ్యాన్ని నిర్ధారించేది దంతాలేనన్నారు. ప్రధానంగా జంక్ ఫుడ్, స్వీట్స్, ఐస్ క్రీములు దంతా ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయన్నారు. ప్రిన్సిపాల్ సునీత, అధ్యాపకులు అయోధ్యరెడ్డి, మామిడాల శ్రీనివాస్, స్ఫూర్తి క్లబ్ అధ్యక్షుడు హరిబాబు, సత్యానందం పాల్గొన్నారు.

సజావుగా ఇంటర్ సెకండియర్ పరీక్షలు

- జిల్లాలో 97శాతం విద్యార్థులు హాజరు

సిద్దిపేట అర్బన్, మార్చి 6: సిద్దిపేట జిల్లావ్యాప్తంగా ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. గురువారం జరిగిన ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షకు 97శాతం మంది విద్యార్థులు హాజరైనట్లు అధికారులు వెల్లడించారు. మొత్తం 9,452 మంది విద్యార్థులకు, 7,018 మంది జనరల్ విద్యార్థులు, 2,099 మంది ఒకేషనల్ విద్యార్థులు కలిపి 9,117 మంది హాజరయ్యారు. 335 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని అధికారులు తెలిపారు. పలు పరీక్షా కేంద్రాలను అదనపు కలెక్టర్లు గరిమా అగర్వాల్, అబ్దుల్ హమీద్ సందర్శించారు.

పాత అలైన్‌మెంట్ ప్రకారమే భూ సేకరణ

కోహెడ, మార్చి 6: గౌరవెల్లి ఎడమ కాలువ భూసేకరణ పాత అలైన్‌మెంట్ ప్రకారమే చేస్తామని, ఇందులో రైతులు అనుమానాలు పెట్టుకోవద్దని ఐబీడీఈ రేష్మ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రైతులు భూసేకరణపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. అలైన్‌మెంట్ మార్పు జరుగుతుందని వచ్చిన వార్తలు అవాస్తవమన్నారు. రైతులకు ఏమైనా అనుమానాలు ఉంటే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేఖ, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గజ్వేల్, మార్చి 6: గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025 విద్యా సంవత్సరానికి ఎకనామిక్స్ పోస్టుకు అర్హత కలిగిన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ నిఖత్‌అంజుమ్ గురువారం ప్రకటనలో తెలిపారు. ఎంఏ ఎకనామిక్స్‌లో 55శాతం మార్కులతోపాటు నెట్, సెట్, పీహెచ్‌డీ అర్హత సాధించిన వారు ఈనెల 10లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైన వారికి 11న కళాశాలలో ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు.

మందుబాబులకు జరిమానా

చేర్యాల, మార్చి 6 : మద్యం తాగి డ్రైవింగ్ చేసిన వారికి న్యాయమూర్తి గురువారం జరిమానా విధించారు. చేర్యాలలో మద్యం తాగి ద్విచక్ర వాహనాలు నడిపిన 15 మందికి రూ.1000 చొప్పున, మరొక వ్యక్తికి రూ.1500, మరో నలుగురికి రూ.2 వేల చొప్పున చేర్యాల కోర్టు ఇన్‌చార్జి జడ్జి కృష్ణతేజ జరిమానా విధించారు. మద్యం తాగి ఫోర్‌వీలర్ నడిపిన మరో వ్యక్తికి రూ. 10వేలు జరిమానాను జడ్జి విధించారు. జడ్జి మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపడం నేరమని, అలాంటి వ్యక్తులకు శిక్షలుంటాయన్నారు. చిన్నచిన్న విషయాల్లో తగదాలు పడి అనవసరంగా పంతాలకు పోకుండా ఇరువర్గాలూ రాజీకుదుర్చుకోవాలని సూచించారు. ఈ నెల 8న జరిగే లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించుకోవాలన్నారు.

కరాటేతో ఆత్మరక్షణ

హుస్నాబాద్, మార్చి 6: ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుందని జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ సెక్రెటరియల్ అధికారి రామస్వామి అన్నారు. గురువారం హుస్నాబాద్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో కరాటే మాస్టర్ రాజు విద్యార్థినులకు ఇస్తున్న కరాటే శిక్షణాతరగతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలికల్లో ఆత్మస్థైర్యాన్ని పెంచేందుకు ప్రభుత్వం కరాటే శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నదని, దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కరాటే శారీరక సమతుల్యతతోపాటు మానసిక ఉల్లాసానికి ఉపయోగపడుతుందన్నారు. కరాటే శిక్షణ ఇస్తున్న మాస్టర్ రాజును ఆయన అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం వాసుదేవరెడ్డి, ఉపాధ్యాయులు వీరారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

బైక్ దొంగ రిమాండ్

సిద్దిపేట టౌన్, మార్చి 6: బైక్ దొంగిలించిన దొంగను సిద్దిపేట టూటౌన్ పోలీసులు గురువారం అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. సీఐ ఉపేందర్ వివరాల ప్రకారం.. ఇర్కోడ్ గ్రామానికి చెందిన మహంకాళి లక్ష్మణ్, పాత నేరస్తుడు ఆస సుదర్శన్‌తో కలిసి పలు మోటర్ సైకిళ్లను దొంగిలించాడని చెప్పారు. సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద నిర్వహిస్తున్న వాహన తనిఖీల్లో లక్ష్మణ్ పట్టుబడ్డారని చెప్పారు. ఈమేరకు దొంగిలించిన బైక్‌ను స్వాధీనం చేసుకొని నిందితుడిని జ్యుడీషియల్ కస్టడికి తరలించామన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

బెజ్జంకి, మార్చి 6: అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం మండలంలోని ముత్తన్నపేటలో చోటుచేసుకుంది. ఎస్ఐ కృష్ణారెడ్డి కథనం మేరకు...గ్రామానికి చెందిన గాజ రవి(45) ఆర్థిక ఇబ్బందులతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. రవి కుమార్తె, కుమారుడు హైదరాబాద్‌లో చదువుతున్నారు. వారి కాలేజీ ఫీజులు, వ్యవసాయానికి చేసిన అప్పులు ఎలా తీర్చాలో అర్థంకాకా మనోవేదనతో బుధవారం సాయంత్రం ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అంబులెన్స్‌లో కరీంనగర్ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించి మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. మృతుడి భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

స్వచ